# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 01 జూన్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## రాజీవ్ యువవికాసం పథకానికి హైదరాబాద్ నుంచి 9,219 మంది ఎంపిక

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాజీవ్ యువవికాసం పథకంపై తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కీలక ప్రకటన చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం, జూన్ 2న యువ వికాసం లబ్ధిదారులకు లోన్లు అందజేస్తామని తెలిపారు. ఇప్పటికే ఎంపిక ప్రక్రియ ముగిసిందన్నారు. తొలి విడతలో భాగంగా జూన్ 2న లక్ష మందికి లోన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమయ్యింది. తొలి విడతా జాబితాలోని లక్ష మందిలో హైదరాబాద్ నుంచి 9,219 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామని భట్టి చెప్పుకొచ్చారు. వీరిలో 3,721మంది రూ.50 వేల రుణాలు మంజూరు చేయనున్నారు. మిగతా 5,498 మందికి రూ.లక్ష లోన్లు అందజేస్తారు. వీరందరికి జూన్ 2న డబ్బులు అందజేస్తామని భట్టి తెలిపారు. రాజీవ్ యువవికాసం పథకం కింద హైదరాబాద్ నగరం నుంచి మొత్తం 1,28,763 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. వీటి వెరిఫికేషన్ బాధ్యతను బ్యాంకర్లకు అందజేశారు. అధికారులు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి.. వారి నుంచి అర్హులను ఎంపిక చేశారు. ఇలా అప్లై చేసుకున్న వారిలో రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు అప్లై చేసుకున్న వారికి జూన్ 2న నిధులు మంజూరు చేస్తామని భట్టి తెలిపారు. అలానే రూ.2 లక్షల లోపు వారికి జులైలో, రూ.2–రూ.4 లక్షల వరకు ఉన్నవారికి ఆగస్టు, సెప్టెంబర్ నెలలో లోన్లు అందజేయనున్నట్టు చెప్పుకొచ్చారు.



## అత్యాధునిక గోశాలలను ఏర్పాటు చేయండి

- ప్రణాళికలు సిద్ధం చేయాలి
- ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయండి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో అత్యాధునిక సౌకర్యాలతో గోశాలలను ఏర్పాటు చేయడానికి సంబంధించి పూర్తిస్థాయి ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గోశాలల ఏర్పాటుకు సంబంధించి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయడమే కాకుండా, నిర్ణీత గడువులోగా నివేదిక రూపొందించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో గోశాలల ఏర్పాటు, నిర్వహణ, సంరక్షణ, అభివృద్ధి వంటి అంశాలపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి ఉన్నతాధికారుల సమావేశంలో సమీక్షించారు. గోశాలల నిర్మాణం, నిర్వహణ, సంరక్షణ కోసం పూర్తిస్థాయి బడ్జెట్ అంచనాలు రూపొందించాలని చెప్పారు. గోసంరక్షణ, వాటి నిర్వహణ సులువుగా ఉండేందుకు వీలుగా గోశాలల ఏర్పాటు జరగాలని, మొదటి దశలో రాష్ట్రంలోని వెటర్నరీ యూనివర్సిటీ, కళాశాలలు, అగ్రికల్చర్ యూనివర్సిటీ, కళాశాలలు, దేవాలయాలకు సంబంధించిన భూముల్లో గోశాలలు ఏర్పాటు చేయాలని చెప్పారు. గోశాలల ఏర్పాటు కోసం అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించాలని, కనీసం 50 ఎకరాల విస్తీర్ణానికి తగ్గకుండా గోశాలలు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. బంధించినట్టుగా ఇరుకు స్థలాల్లో కాకుండా మేతకు, స్వేచ్ఛగా తిరిగేందుకు వీలుగా ఉండాలన్నారు. గోశాలల నిర్వహణ, సంరక్షణ విషయంలో ధార్మిక సంస్థలను భాగస్వాములను చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎంకేపల్లిలో ఏర్పాటు చేయనున్న గోశాలకు సంబంధించి పలు డిజైన్లను పరిశీలించి పలు మార్పులను సూచించారు. మరో నాలుగైదు రోజుల్లోగా తుది మోడల్‌ను ఖరారు చేయాలని చెప్పారు.

## ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



- గతంలో 6.70 లక్షల ఎకరాలను పేదలకు పంపిణీ చేశాం
- గిరిజనుల కోసం ఇందిరాగాంధీ సౌర గిరిజల పథకం ప్రారంభించాం
- ఈ పథకానికి రూ. 12,500 కోట్లు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, ఈ వర్గాలకు రాజకీయ అధికారం కల్పించాలని కాంగ్రెస్ చిత్తశుద్ధితో ఉందని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క అన్నారు. వెనుకబడిన వర్గాల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం భూ గరిష్ట పరిమితి చట్టం చేసిందని, భూమిలేని ఎస్సీ, ఎస్టీలకు భూములు పంపిణీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే అని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో 6.70 లక్షల ఎకరాలను పేదలకు పంపిణీ చేస్తే ఆ భూములను దున్నుకోకుండా అడ్డుకోవడమే కాకుండా మహిళలని చూడకుండా చెట్టుకు కట్టేసి బీఆర్ఎస్ దాష్టికాలకు పాల్పడిందని విమర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో జరుగుతున్న తెలంగాణ కాంగ్రెస్ ఆదివాసి కార్యకర్తల సమ్మేళనంలో భ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఏఐసీసీ వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్ , పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు హాజరైన ఈ కార్యక్రమంలో భట్టి మాట్లాడుతూ.. . గిరిజనుల కోసం ఇటీవలే ఇందిరాగాంధీ సౌర గిరిజల పథకాన్ని ప్రారంభించామని గుర్తు చేశారు. ఈ పథకానికి రూ. 12,500 కోట్లు కేటాయించామన్నారు. 2013లో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందని ఈ సబ్ ప్లాన్ కు రూ. 17,169 కోట్లు కేటాయిస్తే గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు గాలికి వదిలేసిందని అన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ఇవ్వలేదని ఉన్న నిధులు కూడా ఖర్చు చేయలేదని ధ్వజమెత్తారు.వెనుకబడిన వర్గాల వారు తలెత్తుకుని ఆత్మగౌరవంతో బతకాలనేది కాంగ్రెస్ లక్ష్యం అని ఈ వర్గాలను దృష్టిలో పెట్టుకునే దేశంలోని అన్ని రకాల వనరులను ఎస్సీ, ఎస్సీ, బీసీలకు ఇవ్వాలనేది కాంగ్రెస్ నిర్ణయించిందన్నారు. వెనుకబడిన వర్గాలను దృష్టిలో పెట్టుకునే కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షమ పథకాలను రూపొందిస్తోందన్నారు.

కాంగ్రెస్ చేపట్టిన పథకాలను కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు భట్టి విక్రమార్క. దళితులు, గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేసిన భూములను బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పేరుతో హస్తగతం చేసుకున్నారన్నారు. చెప్పినట్లుగా తాము అధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో వేసి భూభారతి తీసుకువచ్చామన్నారు. రెసిడెన్షియల్ స్కూల్స్ పై గత పదేళ్లు బీఆర్ఎస్ ఆలోచన చేయలేదన్నారు. కానీ తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను పక్కా భవనాలతో నిర్మించే కార్యక్రమం చేపట్టామని వివరించారు.

## 'ఇండియా ఫస్ట్, తెలంగాణ ఫస్ట్' మా విధానం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్
- ఇంగ్లాండ్‌లోని వార్విక్ యూనివర్సిటీలో పీడీఎస్ఎల్ నాలెడ్జ్ సెంటర్‌ను ప్రారంభించిన కేటీఆర్




**బలగం టీవీ, లండన్**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు తమ విధానం "ఇండియా ఫస్ట్, తెలంగాణ ఫస్ట్" అని పునరుద్ఘాటించారు. అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ అభివృద్ధి చెందాలన్నదే తమ అభిమతం అని, పెట్టుబడుల కోసం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఇంగ్లాండ్‌లోని వార్విక్ యూనివర్సిటీలో పీడీఎస్ఎల్ నాలెడ్జ సెంటర్ను ప్రారంభించిన సందర్భంగా కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు.పీడీఎస్ఎల్ సంస్థ మెక్‌లారెన్, ఆస్టన్ మార్టిన్, జాగ్వార్, ల్యాండ్ రోవర్ వంటి దిగ్గజ ఆటోమోటివ్ కంపెనీలకు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సేవలను అందిస్తుంది. వార్విక్ యూనివర్సిటీలో ఈ నాలెడ్జ్ సెంటర్ ప్రారంభించడం తెలంగాణ టాలెంట్‌కు నిదర్శనం అని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే హైదరాబాద్ పూణే, చెన్నైల సరసన ఆటోమోటివ్ హబ్‌గా నిలిచిందని ఆయన గుర్తుచేశారు.

కేటీఆర్ మాట్లాడుతూ, తెలంగాణ విజయాల గురించి మాట్లాడటానికి తనకు ఎల్లప్పుడూ గర్వంగా ఉంటుందని తెలిపారు. ఈ అద్భుతమైన అవకాశాన్ని ఇచ్చినందుకు పీడీఎస్ఎల్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఆటోమొబైల్ రంగంలో పీడీఎస్ఎల్ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అలాగే, పీడీఎస్ఎల్ తమ కార్యకలాపాలను తెలంగాణలో విస్తరించాలని కోరారు. ఇంగ్లాండ్‌లో యూనివర్సిటీ, ఇండస్ట్రీల మధ్య ఉన్న పరస్పర సహకారం తనను ఆశ్చర్యపరిచిందని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ వినూత్న విధానాలతోనే ఐటీ, లైఫ్ సైన్సెస్‌తో పాటు ఆటోమోటివ్ రంగంలోనూ తెలంగాణ సత్తా చాటిందని కేటీఆర్ వివరించారు. తమ ప్రభుత్వ కాలంలో ఆటోమోటివ్ రంగంలో కేవలం రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కే పరిమితం కాకుండా తయారీ రంగంలో కూడా తెలంగాణను నంబర్ వన్‌గా

మిగితా 2వ పేజీలో

### విశ్వసుందరిగా

# ఓపల్ సుచాట చువాంగ్‌సీ

- థాయిలాండ్ భామను వరించిన మిస్ వరల్డ్ 2025 కిరీటం
- ఓపల్ సుచాతకు కిరీటాన్ని అలంకరించిన మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా
- ఫస్ట్ రన్నరప్‌గా మిస్ పోలెండ్, సెకండ్ రన్నరప్‌గా మిస్ పోలాండ్
- మూడో రన్నరప్‌గా నిలిచిన మిస్ మార్టినిక్
- థాయిలాండ్ భామను వరించిన మిస్ వరల్డ్ 2025 కిరీటం
- వేడుకల్లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి





**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ నగరంలో అంగరంగ వైభవంగా సాగిన 72వ విశ్వసుందరి పోటీల్లో థాయ్‌లాండ్‌కు చెందిన ఓపల్ సుచాత విజేతగా నిలిచింది. మిస్ వరల్డ్ 2025 కిరీటాన్ని కైవసం చేసుకుంది. 107 దేశాలకు చెందిన అందాల భామలతో పోటీ పడి సుచాత విజేతగా నిలిచింది. మిస్ వరల్డ్ కిరీటాన్ని గెలిచిన మొదటి థాయ్‌లాండ్ దేశస్తురాలు సుచాత కావటం విశేషం. సుచాత 2003, సెప్టెంబర్ 20వ తేదీన థాయ్‌లాండ్‌లోని ఫుకెట్‌లో జన్మించింది. కజోన్‌కిట్సుకా స్కూల్లో ప్రైమరీ, సెకండరీ ఎడ్యుకేషన్ పూర్తి చేసింది. ప్రస్తుతం పాలిటిక్స్, ఇంటర్ నేషనల్ రిలేషన్స్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ చేస్తోంది. 2021 నుంచి అందాల పోటీల్లో పాల్గొంటోంది. గతంలో మిస్ యూనివర్స్ థాయ్‌లాండ్ 2024 విజేతగా నిలిచింది. మిస్ వరల్డ్‌గా ఎంపికైన ఓపల్ సుచాతకు రూ. 8.5 కోట్ల ప్రైజ్ మనీని అందించనున్నారు. సుచాత థాయ్‌లాండ్‌లోని ఫుకెట్‌లో జన్మించారు.

కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల నుంచి హాజరైన ప్రతినిధుల హర్షధ్వానాల మధ్య విశ్వసుందరి పోటీల విజేతగా నిలిచిన ఓపల్ సుచాటకు 71వ విశ్వసుందరి క్రిస్టినా పిస్కోవా కిరీట ధారణ చేశారు. అంతకుముందు ముఖ్యమంత్రి సమక్షంలో మిస్ వరల్డ్ సీఈఓ జూలియా మోర్లీ ప్రపంచ సుందరి విజేతను ప్రకటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి విశ్వసుందరి ఓపల్ సుచాటకు అభినందనలు తెలియజేశారు. మిగతా కేటగిరీల విజేతలకు కూడా అభినందనలు తెలిపారు. "తెలంగాణ సంస్కృతి, వారసత్వం, చరిత్ర, విలువలు, ప్రపంచానికి చాటాం. ప్రపంచ నలుమూలల నుంచి విచ్చేసిన సందర్శకులకు తెలంగాణ రైజింగ్ దార్శనికతను చూపించాం" అని ముఖ్యమంత్రి అన్నారు.

చివరి దశలో ఖండాల వారిగా టాప్‌లో నలుగురు విజేతలుగా నిలవగా చివరి పోటీలో విశ్వసుందరి కిరీటం ఓపల్ సుచాటను వరించింది. ఈ 72 వ మిస్ వరల్డ్ పోటీల్లో 108 దేశాల నుంచి కంటెస్టెంట్లు పాల్గొన్నారు. ఈ నెల 7 వ తేదీన ప్రారంభమైన మిస్ వరల్డ్ పోటీల్లో వివిధ కేటగిరీల్లో అనేక దశల్లో విజేతలుగా నిలిచారు. ప్రపంచ సుందరి ఎంపిక అనంతరం హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి మిస్ వరల్డ్ 2025 పోటీలు ముగిసినట్టుగా ప్రకటించారు. పోటీకి హాజరైన కంటెస్టెంట్లు తెలంగాణలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించగా, హైదరాబాద్ ఆతిథ్యం అత్యద్భుతమని కంటెస్టెంట్లు ఆనందం వ్యక్తం చేశారు. "తెలంగాణ జరూర్ ఆనా" నినాదం ప్రస్తుతం విశ్వవ్యాప్తమైంది.



గత సంవత్సరం (2024) మిస్ వరల్డ్‌గా నిలిచిన క్రిస్టినా పిజ్కోవా, 72వ ప్రపంచ సుందరి ఓపల్ సుచాత చువాంగ్‌కు సంప్రదాయబద్ధంగా కిరీటాన్ని అలంకరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక పోటీలో పోలెండ్ దేశానికి చెందిన యువతులు రెండు ప్రధాన స్థానాల్లో నిలవడం గమనార్హం. ఫస్ట్ రన్నర్ అప్‌గా మిస్ పోలెండ్ నిలవగా, సెకండ్ రన్నర్ అప్‌గా మిస్ పోలాండ్ నిలిచారు. మూడో రన్నర్ అప్‌గా మిస్ మార్టినిక్ నిలిచారు.

## కల్వకుంట్ల ఆర్ట్స్ పతాకంపై కాంగ్రెస్ దర్శకత్వంలో 'చార్ పత్తా' సినిమా



- కవిత ఎపీసోడ్ అంతా కాంగ్రెస్ డ్రామా
- బీఆర్ఎస్‌తో ఎలాంటి పొత్తు లేదు
- అవినీతి పార్టీని దగ్గరకు రానివ్వం
- కేంద్ర మంత్రి బండిసంజయ్


**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కల్వకుంట్ల ఆర్ట్స్ పతాకంపై కాంగ్రెస్ పార్టీ దర్శకత్వంలో కల్వకుంట్ల కవిత ప్రధాన పాత్రధారిగా 'చార్ పత్తా' సినిమాను నడిపిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఇదంతా కాంగ్రెస్ ఆడుతున్న డ్రామా అన్నారు సంజయ్. ఇందులో కేసీఆర్ ను జోకర్ గా మార్చారని.. కవిత ఎపిసోడ్ తో ప్రజలకు ఏమైనా మేలు జరుగుతోందా? మీడియా కూడా ఆలోచించాలన్నారు. కరీంనగర్ లోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో, చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్ లో, బోయినిపల్లి మండలం వెంకట్రావుపల్లెలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, కరీంనగర్ మాజీ మేయర్ సునీల్ రావు తదితరులతో కలిసి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు.

ఆరు గ్యారంటీలపై చర్చ జరగకుండా చిట్ చాట్ ల పేరుతో ప్రజల దృష్టి మళ్లించే కుట్ర జరుగుతోందని, కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని, దీనిపై ప్రజలు తీవ్రమైన ఆగ్రహంతో ఉండటంతో వాళ్ల దృష్టిని మళ్లించేందుకు ఇట్లాంటి ఎత్తుగడ వేస్తోందని విమర్శించారు.గతంలో బీఆర్ఎస్ పాలనలో చాలా మంది ఎమ్మెల్యేలు బీజేపీతో టచ్ లోకి వచ్చినప్పుడల్లా, కేసీఆర్ ఆ పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశమై బీజేపీతో పొత్తు పెట్టుకుంటామని, ఆయనకు కేంద్ర మంత్రి పదవి ఇస్తారని మాయ మాటలు చెప్పి వాళ్లను బీజేపీలోకి వెళ్లకుండా చేసేవారని బండి సంజయ్ ఆరోపించారు..

'బీఆర్ఎస్ అంటేనే కుటుంబ, అవినీతి పార్టీ. కవితను అరెస్ట్ చేయకుండా ఉండటానికి బీజేపీతో కలవడానికి బీఆర్ఎస్ ప్రయత్నించింది. ఈ అవినీతి, కుటుంబ పార్టీని మేం దగ్గరకు రానివ్వలేదు. కుటుంబ

మిగితా 2వ పేజీలో



## దేశంలో కరోనా విలయతాండవం

- 3వేలు దాటిన కేసులు..
- 29కి చేరిన మృతులు..

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

దేశంలో కరోనా విలయతాండవం చేస్తోంది. కొవిడ్ కేసులు పెరుగుతున్నాయి. యాక్టివ్ కేసుల సంఖ్య 3,000 దాటడం ఆందోళన కలిగిస్తోంది. కేరళలో కేసులు వేగంగా పెరుగుతున్నాయి. మహారాష్ట్ర, ఢిల్లీలోనూ బాధితులు పెరుగుతున్నారు. శనివారం నాటికి దేశంలో మొత్తం 3,395 యాక్టివ్ కరోనా కేసులు నమోదయ్యాయి. గత 24 గంటల వ్యవధిలో కొత్తగా 685 మందికి వైరస్ సోకినట్లు నిర్ధారణ అయింది. ఇదే సమయంలో ఢిల్లీ, కేరళ, కర్ణాటక, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఒక్కొక్కరు చొప్పున మొత్తం నలుగురు వ్యక్తులు మరణించినట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మే 22న దేశంలో 257 యాక్టివ్ కేసులు ఉండగా, ఆ సంఖ్య మే 26 నాటికి 1,010కి చేరింది. ఇప్పుడు ఆ సంఖ్య మరింత పెరిగి 3,395కి చేరుకుంది.

ప్రస్తుతం దేశవ్యాప్తంగా నమోదైన యాక్టివ్ కేసుల్లో

మిగితా 2వ పేజీలో

## రేపే విడుదల..

**రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా.. వరుసగా కొత్త స్కీంలు, ప్రోగ్రాంలు ప్రారంభం..**

- 'మిషన్ 26 డేస్' పేరుతో చర్యలు
- రాజీవ్ యువ వికాసం శాంక్షన్ లెటర్ల పంపిణీ
- మొదటివారంలో ఇందిరమ్మ ఇండ్లకు ప్రారంభోత్సవం
- రైతు భరోసా పెండింగ్ నిధుల చెల్లింపునకు నిర్ణయం.
- మూడో తేదీన షురూ కానున్న రెవెన్యూ సదస్సులు
- గ్రామాలకు కొత్త జీపీవోలు..
- ఉద్యోగుల డిమాండ్లపైనా ప్రకటన
- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సర్కారు..

**బలగం టీవీ, హైదరాబాద్**

జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను ప్రారంభించాలని రాష్ట్ర సర్కారు భావిస్తున్నది. దీంతోపాటు ఇప్పటికే మొదలైన స్కీములను స్పీడప్ చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేకంగా "మిషన్ 26 డేస్" పేరుతో పలు కొత్త పథకాలు, కార్యక్రమాల అమలును వేగవంతం చేస్తున్నది. లోకల్ బాడీస్ ఎన్నికలకు వెళ్లాలని భావిస్తున్న ప్రభుత్వం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాటి నుంచి వరుసగా రాజీవ్ యువ వికాసం, గ్రామ పాలనా అధికారులకు అపాయింట్మెంట్ ఆర్డర్లు, ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం లాంటి కార్యక్రమాలు చేపట్టబోతున్నది. దీంతో పాటు రైతు భరోసా పెండింగ్ నిధుల చెల్లింపునకూ నిర్ణయం తీసుకుంది. 3వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా భూసమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు ప్రారంభించబోతున్నది.

అందులో భాగంగా రెవెన్యూ ఆఫీసర్ల సెలవులను రద్దు చేసింది. గ్రామాలకు కొత్త జీపీవోలను నియమించడంతో పాటు ఉద్యోగుల డిమాండ్లపైనా ప్రభుత్వం నుంచి ప్రకటన వచ్చే చాన్స్ ఉంది. రాష్ట్ర అవతరణ వేడుకలు, కొత్త పథకాల ప్రారంభం నేపథ్యంలో

మిగితా 2వ పేజీలో




## కేసీఆర్‌కు బీఆర్ఎస్ ఒక కన్ను.... తెలంగాణ జాగృతి మరొక కన్ను

- కేసీఆర్ కు నోటీసులకు నిరసనగా జూన్ 4న మహా ధర్నా
- తెలంగాణ జాతిపిత కేసీఆర్ కు నోటీసులు ఇవ్వడమంటే... యావత్తు తెలంగాణకు నోటీసులు ఇచ్చినట్లే
- కేసీఆర్ పై ఈగ వాలినా ఊరుకోబోము
- తెలంగాణ సోయితో రేవంత్ రెడ్డి పరిపాలించడం లేదు
- బీసీ బిల్లు ఆమోదించకపోతే బీజేపీకి సెగతగిలేలా పోరాటం
- రైల్ రోకో వంటి కార్యక్రమానికి పిలుపునిస్తాం
- జాగృతి నూతన కార్యాలయం ఏర్పాటు

వివరాలు 2వ పేజీలో

# రేపే విడుదల..



(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలంతా తమ నియోజకవర్గాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పథకాల అమలును పర్యవేక్షించడంతో పాటు ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని సూచించింది.

### యువ వికాసం.. ఇందిరమ్మ ఇండ్లపై ఫోకస్

రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున ప్రతిష్టాత్మక రాజీవ్ యువ వికాసం స్కీంను సర్కారు ప్రారంభించనుంది. యువత సాధికారత, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే లక్ష్యంతో రాజీవ్ యువ వికాసం స్కీంకు రూపకల్పన చేశారు. నాలుగు నెలల్లో 5 లక్షల మందికి ఈ పథకం అందజేయనున్నారు. దశల వారీగా అమలు చేయనున్న ఈ పథకంలో తొలుత రూ. లక్షలోపు వారికి సబ్సిడీ అందజేయనున్నారు. ప్రతినెలా రూ.1500 కోట్ల చొప్పున రూ.6 వేల కోట్ల సబ్సిడీని అక్టోబర్ 2 నాటికి లబ్ధిదారులకు అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా వచ్చే నెల మొదటి వారంలో ఇందిరమ్మ ఇండ్లను పూర్తి స్థాయిలో ప్రారంభించాలని డిసైడ్ అయ్యారు. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కింద పూర్తిచేసిన ఇండ్లకు ప్రారంభోత్సవాలు చేయనున్నారు. జరుగుతున్న పనులను బట్టి ప్రభుత్వం కూడా ఇందిరమ్మ లబ్ధిదారులకు విడతల వారీగా నిధులు రిలీజ్ చేస్తూ వస్తోంది. వారిలో కొందరు జూన్ మొదటి వారంలోనే గృహ ప్రవేశం చేయనున్నారు.

### రైతు భరోసా నిధుల చెల్లింపు

వానాకాలం పంట సీజన్ ప్రారంభం కావడంతో రైతు భరోసా పథకం కింద పెండింగ్‌లో ఉన్న నిధులను జూన్లోనే చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వాస్తవానికి మేలోనే పూర్తిగా చెల్లించాలని అనుకున్నప్పటికీ ఆర్థిక పరిస్థితులు అనుకూలించలేదని చెప్తున్నారు. దీంతో జూన్ మొదటి వారంలోనే పెట్టుబడి సాయం ప్రారంభించాలని ఇప్పటికే అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

### కొత్త జీపీవోలు, ఉద్యోగుల డిమాండ్లపై ప్రకటన

గ్రామ స్థాయిలో పరిపాలనను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఆఫీసర్ (జీపీవో) పోస్టులను భర్తీ చేస్తోంది. దాదాపు 3,500 మందిని జూన్ 2న రెవెన్యూ శాఖలోకి తీసుకుంటూ రీఅపాయింట్మెంట్ లెటర్లు అందజేయనున్నారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్లపైనా ప్రభుత్వం ప్రకటన చేయనున్నట్లు సీఎంవో వర్గాలు చెప్తున్నాయి. ఇందు కోసం ఇప్పటికే రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ కేబినెట్ సబ్ కమిటీకి రిపోర్ట్ ఇవ్వనుంది.

మరోవైపు భూ సమస్యల పరిష్కారం, రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన లక్ష్యంగా ప్రభుత్వం జూన్ 3 నుంచి రెవెన్యూ సదస్సులను ప్రారంభించనుంది. ఇప్పటికే పైలెట్మండలాల్లో నిర్వహిస్తున్న సదస్సులకు మంచి స్పందన వస్తోంది. కోర్టు వివాదాల్లో ఉన్న సాదా బైనామాలకు తప్ప మిగిలిన సమస్యల పరిష్కారానికి యంత్రాంగం సిద్ధమవుతోంది. వేల సంఖ్యలో అప్లికేషన్లు రావడంతో వాటి పరిష్కారానికి ఎక్కువ టైమ్ పట్టే చాన్స్ ఉన్నప్పటికీ పరిష్కారమైతే రైతులకు రిలీఫ్ దొరకనుంది.



# కేసీఆర్‌కు బీఆర్ఎస్ ఒక కన్ను.... తెలంగాణ జాగృతి మరొక కన్ను

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ జాగృతి సంస్థ 2006లో ఏర్పాటు చేశామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. కేసీఆర్, ప్రొఫెసర్ జయశంకర్ ఆశీస్సులతో జాగృతిని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కేసీఆర్‌కు బీఆర్ఎస్ ఒక కన్ను అన్నారు. తెలంగాణ జాగృతి మరొక కన్ను అన్నారు. బంజారాహిల్స్ లోని తన ఇంటికి సమీపంలోనే తెలంగాణ జాగృతి కొత్త కార్యాలయాన్ని కవిత శనివారం ప్రారంభించారు. కొత్త ఆఫీసులో కల్వకుంట్ల కవిత పూజలు చేశారు. గతంలో ఇందిరాపార్కు వద్ద ఆఫీసు ఉండేది. దానిని మూసి వేసిన కవిత కొత్తగా తెలంగాణ జాగృతి కార్యాలయాన్ని తన ఇంటివద్దనే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు.

తన తండ్రి, మాజీ సీఎం కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసుల నేపథ్యంలో ఈనెల నాలుగున ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తామని ఆమె తెలిపారు. కేసీఆర్‌పై ఈగ వాలినా సహించబోమని హెచ్చరించారు. పార్లమెంటులో బీసీ బిల్లు ఆమోదించకపోతే బీజేపీకి సెగ తగిలేలా పోరాటం చేస్తామని తెలిపారు. వివిధ సమస్యలపై త్వరలో రైల్‌రోకోలాంటి కార్యక్రమాలకు సైతం పిలుపునిస్తామని చెప్పారు. జాగృతిలో ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, క్రిస్టియన్, సిక్కు విభాగాలను కూడా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

జూన్ 2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జై తెలంగాణ అని అనాలని కవిత డిమాండ్ చేశారు. జై తెలంగాణ అనని వారికి ముఖ్యమంత్రి పదవి దక్కిందన్నారు. ఇది మన తెలంగాణ ప్రజల గ్రహచారమని అన్నారు. అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారని అన్నారు. తెలంగాణలో జూన్ 2న రాజీవ్ గాంధీ యువ పథకం పేరు పెడతామని ముఖ్యమంత్రి రేవంత్ అన్నారని, తెలంగాణకు రాజీవ్ గాంధీ కి ఏం సంబంధమని కవిత ప్రశ్నించారు. తెలంగాణవాదుల పేర్లు పెట్టాలని ఆమె కోరారు. తెలంగాణ నీటిని తరలించుకుపోతున్నా రేవంత్ రెడ్డి పట్టించుకోవడం లేదన్నారు. బనకచర్ల ప్రాజెక్టును చంద్రబాబు నిర్మిస్తున్నప్పటికీ ఎందుకు అభ్యంతరం చెప్పడం లేదని కల్వకుంట్ల కవిత నిలదీశారు. గోదావరి, కావేరీ అనుసంధానం పేరు మీద తెలంగాణ నీటిని చంద్రబాబు తరలించుకుపోతున్నారని, అపెక్స్ కమిటీ ని అత్యవసరంగా ఏర్పాటు చేయాలని జూన్ 2నడిమాండ్ చేయాలని కల్వకుంట్ల కవిత పిలుపు నిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి వేల ఎకరాలకు నీళ్లు ఇస్తే నోటీసులు కేసీఆర్ కు ఎందుకు ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. అది కాంగ్రెస్ కమిషనా? కేసీఆర్ కమిషనా? అని ప్రశ్నించారు. తెలంగాణ జాతిపిత మీద ఇంతటి కక్షసాధింపా? అని ఆమె మండి పడ్డారు.

# 'ఇండియా ఫస్ట్, తెలంగాణ ఫస్ట్' మా విధానం

(మొదటి పేజీ తరువాయి)

నిలిపేందుకు పాలసీలు తీసుకువచ్చామని తెలిపారు.భారతదేశంలో ఫార్ములా ఈ రేసింగ్ ఛాంపియన్‌షిప్‌ను నిర్వహించిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని కేటీఆర్ గుర్తు చేశారు. పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు రాష్ట్రంలో మొబిలిటీ వ్యాలీని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేసిందని చెప్పారు. తమ ప్రభుత్వ నిరంతర కృషితో అంతర్జాతీయ కంపెనీలకు కొత్త చిరునామాగా తెలంగాణ మారిందన్నారు. గూగుల్, అమెజాన్, ఫేస్‌బుక్ వంటి కార్పొరేట్ దిగ్గజాలు తమ అతిపెద్ద కార్యాలయాలను హైదరాబాద్‌లో ప్రారంభించాయని గుర్తుచేశారు. తమ తొమ్మిదేళ్ల కాలంలో ఐటీ ఉద్యోగాలు, ఎగుమతులతో పాటు ఇతర రంగాల్లోనూ తెలంగాణ అద్భుతంగా పురోగతి సాధించిందని వివరించారు.

పీడీఎస్ఎల్ డైరెక్టర్ క్రాంతి పుప్పాల మాట్లాడుతూ.. కేటీఆర్ ఆలోచనలు, పనితీరు కేవలం తెలంగాణకు మాత్రమే పరిమితం కాలేదన్నారు. ఆయన చేసిన పనులు, తీసుకొచ్చిన విధానాలు, ముఖ్యంగా ఇన్నోవేషన్ రంగానికి చేసిన కృషి వల్ల ఐటీ ఒక్కటే కాదు అనేక రంగాల్లోనూ తెలంగాణ అగ్రగామిగా నిలబడిందన్నారు. అనేక దిగ్గజ కంపెనీలను హైదరాబాద్‌కు రప్పించి, తన పనితీరుతో గ్లోబల్ లీడర్‌గా ఎదిగిన కేటీఆర్ చేతుల మీదుగా తమ నాలెడ్జ్ సెంటర్‌ను ప్రారంభించుకోవడం తమ కంపెనీకి అత్యంత గౌరవం అని క్రాంతి పుప్పాల తెలిపారు. నాలెడ్జ్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం కేటీఆర్ అక్కడ జరిగే కార్యకలాపాలను పరిశీలించారు. తమ సంస్థ గురించి పీడీఎస్-ఎల్ ప్రతినిధులు ఆయనకు వివరించారు. ఆ తర్వాత కంపెనీ సిబ్బంది, ఉద్యోగులతో కేటీఆర్ సంభాషించారు.

# కల్వకుంట్ల ఆర్ట్స్ పతాకంపై కాంగ్రెస్ దర్శకత్వంలో 'చార్ పత్తా' సినిమా

(మొదటి పేజీ తరువాయి)

పార్టీలకు బీజేపీ దూరం. వాళ్లు ఎన్ని డ్రామాలాడినా బీఆర్ఎస్ ను దగ్గర తీసే ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి అన్నారు.బీఆర్ఎస్ సర్కార్ అవినీతి బయటపెట్టి కేసీఆర్ కుటుంబాన్ని జైలుకు పంపిస్తామన్నారు. కాళేశ్వరం, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్, ఫాంహౌజ్, ఫార్ములా ఈ రేసు కేసుల విషయంలో కేసీఆర్, కేటీఆర్ లను అరెస్ట్ చేస్తామని చెప్పి మాట తప్పారు. కాంగ్రెస్ పై ప్రజలకు నమ్మకం పూర్తిగా పోయిందన్నారు.

వేములవాడ రాజన్న ఆలయ పరిధిలో 18 గోవులు చనిపోవడంపై అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదని, గోవులను కూడా రక్షించకపోతే ఎట్లా? సరైన సౌకర్యాలు కల్పించి వాటిని కాపాడాల్సిన బాధ్యత వాళ్లపై లేదా? గోవుల సంఖ్యకు తగినట్లుగా తగిన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవడం అధికారులు విఫలమైయ్యారని ఆరోపించారు.రాజన్న ఆలయంలో భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఆదాయం కూడా పెరుగుతున్నందున భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించి, భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు దేశద్రోహ వ్యాఖ్యలేనని బండి సంజయ్ అన్నారు. భారత సైన్యం ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా సీఎం మాటలు ఉన్నాయని. పాకిస్తాన్ ఉగ్రవాదులను పెంచిపోషించేలా ఉన్నాయ న్నారు. ఇందిరా హయాంలో యుద్ధం జరిగితే పాక్ ఆక్రమిత కాశ్మీర్ ను ఎందుకు స్వాధీనం చేసుకోలేక పోయిందని ప్రశ్నించారు.

'గంగాధర మండలంలో జాతీయ ఉఫాధి హామీ పథకం కింద రూ.2.63 కోట్ల వ్యయంతో 23 గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినం. అందులో భాగంగా రూ.30 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీ పనులను స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది. అట్లాగే రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వెంకట్రావుపల్లెలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద 2 కోట్ల 33 లక్షల కోట్ల నిధులతో చేపట్టిన హైలెవెల్ బ్రిడ్జి పనులకు స్థానిక ఎమ్మెల్యేతో కలిసి శంకుస్థాపన చేయడం జరిగింది. చొప్పదండి అసెంబ్లీ నియోజక వర్గంలో 2.64 కోట్ల జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో 23 గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్డు, డ్రైనేజీ, ఇతర అభివృద్ధి పనులు చేపట్టడం జరిగింది. ప్రజల ఇబ్బందులను గుర్తుంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అభివృద్ధి పనులు చేస్తున్నాం. రాబోయే రోజుల్లో ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం. అందులో భాగంగానే రూ.30 లక్షలతో అంతర్గత రోడ్లు, డ్రైనేజీని ప్రారంభించుకున్నాం. రాబోయే రోజుల్లో సీఆర్ఐఎఫ్ నిధులతో ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాం" అని అన్నారు.

# దేశంలో కరోనా విలయతాండవం

(మొదటి పేజీ తరువాయి)

కేరళలో అత్యధికంగా 1,336 కేసులు ఉన్నాయి. ఆ తర్వాత మహారాష్ట్రలో 467, ఢిల్లీలో 375, గుజరాత్‌లో 265, కర్ణాటకలో 234, పశ్చిమ బెంగాల్‌లో 205, తమిళనాడులో 185, ఉత్తరప్రదేశ్‌లో 117 యాక్టివ్ కేసులు నమోదయ్యాయి. ఈ పరిణామాల నేపథ్యంలో, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బెహల్ ఇదివరకే కీలక విషయాలు వెల్లడించారు. దేశంలోని పశ్చిమ, దక్షిణ ప్రాంతాల నుంచి సేకరించిన నమూనాల జన్యు క్రమాన్ని విశ్లేషించామని ఆయన తెలిపారు. ప్రస్తుతం కేసుల పెరుగుదలకు కారణమవుతున్న వేరియంట్లు ఒమిక్రాన్ ఉపరకాలేనని, ఇవి అంత తీవ్రమైనవి కావని ఆయన స్పష్టం చేశారు. %ూఖీ.7, శఖీ+, జీచీ.1, చీదీ%.1.8.1 అనే నాలుగు ఒమిక్రాన్ ఉపరకాలు కనుగొన్నామని, వీటిలో మొదటి మూడు రకాలు ఎక్కువ కేసుల్లో కనిపిస్తున్నాయని ఆయన వివరించారు.

# సంగారెడ్డి జిల్లాలో 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు

- **ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించవద్దు**
- **జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**

**బలగం టీవి, హైదరాబాద్**

సంగారెడ్డి జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల పాటు (జూన్ 1 నుంచి 30 వరకు) జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా సంగారెడ్డి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలూ చేపట్టకూడదని తెలిపారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.

# కోడెల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి..

**-అకాల వర్షాలు, అనారోగ్య కారణాలతో 8 కోడెలు మృతి**

**-గోవుల మృతిపై అసత్య ప్రచారాలు చేయవద్దు**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ,వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి గోశాలలోని కోడెల సంరక్షణ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వేములవాడ తిప్పాపూర్ లోని గోశాలను కలెక్టర్ సందీప్ కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.



ఈ సందర్భంగా గోవులకు అందిస్తున్న మేత, ఇతర పదార్థాల నాణ్యత , పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడాతు అకాల వర్షాలు, అనారోగ్య కారణాలతో 8 కోడెలు మృతి చెందాయని అన్నారు. మిగతా ఏ కోడెలు మృతి చెందలేదని,సోషల్ మీడియాలో అనవసరపు అసత్య ప్రచారాలు చేయవద్దని సూచించారు. పశు వైద్యాధికారులు అంజిరెడ్డి, రాహుల్, అభిలాష్, సాహితి, దీప్తి ఆద్వర్యంలో కోడెలకు నిరంతరం వైద్యం అందిస్తున్నారని అన్నారు.కోడెల సంరక్షణను మరింత బాధ్యతగా చూసుకోవాలని సూచించారు. నిత్యం వాటికి అందించే దాణా, మేత విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని ఆదేశించారు. నిత్యం పచ్చి గడ్డి పెట్టాలని, గోశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. త్వరలో కోడెల పంపిణీకి తగు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

# మీ సేవలు భవిష్యత్ తరాలకు ఎంతో స్ఫూర్తిదాయకం



**-ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సుదీర్ఘకాలం పోలీస్ శాఖలో మీరు అందించిన సేవలు భవిష్యత్ తరాలకు ఎంతో స్ఫూర్తిదాయకంమని ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు.శనివారం పదవి విరమణ పొందిన ఎస్సై మారుతి , హెడ్ కానిస్టేబుల్ రాజమౌళి లను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మహేష్ బి. గితే శాలువా పులమాలలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు .ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..సుదీర్ఘ కాలం పాటు పోలీస్ శాఖలో మీరు అందించిన సేవలు భవిష్యత్ తారాల వారికి స్ఫూర్తిదాయకమని, ప్రజలను పోలీసులు సక్రమంగా విధులను నిర్వర్తించడానికి కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతగానో ఉంటుందని వారి తోడ్పాటు వల్లనే విధులను నిర్వర్తించి ఉన్నత స్థానాలకు ఎదగగలరని అన్నారు. పదవీ విరమణ పొందిన తర్వాత వచ్చే ప్రయోజనాలను త్వరగా అందించాలని సిబ్బందికి తెలియజేశారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో తమ శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఆనందంగా గడపాలని అన్నారు. తమ ఆరోగ్యాల పట్ల తగు జాగ్రత్తలను తీసుకోవాలని,ఎటువంటి అవసరం ఉన్న పోలీసు వ్యవస్థ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి పాలనలో గురుకులాలు అధోపాతాళానికి

**డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఎస్సీ సంక్షేమ గురుకులాల విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. రేవంత్ రెడ్డి పాలనలో గురుకులాలు అదోపాతాళానికి వెళ్తున్నాయని, అనేకమంది పేద పిల్లలు రోడ్డున పడాల్సిన పరిస్థితి వచ్చిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు వారి టాయిలెట్స్ వారే కడుక్కుంటే తప్పేంటి అని ఐఏఎస్ అధికారి అంటున్నారని, దీనిపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. “రేవంత్ రెడ్డి ఇంట్లో టాయిలెట్ రేవంత్ రెడ్డి కడుగుతున్నారా? మీ మంత్రులు ఇంట్లో వాళ్ళ టాయిలెట్స్ మంత్రులే కడుగుతున్నారా? మీ పిల్లల స్కూల్లో టాయిలెట్స్ మీ పిల్లలు కడుగుతున్నారా?” అని ప్రశ్నించారు. ఎస్సీ వర్గాల పట్ల ఐఏఎస్ అలుగు వర్షిని వివక్ష చూపుతున్నారని, “అందరికంటే పెద్ద మాదిగ, పెద్ద మాల నేనే” అని రేవంత్ రెడ్డి అంటారని, కానీ పేద పిల్లలు టాయిలెట్స్ వాళ్లే కడుక్కోవాలని ఐఏఎస్ అధికారితో ఎట్లా చెప్పిస్తారని నిలదీశారు. దళిత వర్గాలు గత కొన్ని వందల సంవత్సరాలుగా టాయిలెట్స్ కడుగుతున్నారని, ఎవరి టాయిలెట్స్ వాళ్లే కడుక్కోవాలని రాష్ట్రవ్యాప్తంగా జీవో ఇవ్వాలని రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. ఎస్సీలు ఇంజనీర్లు, డాక్టర్లు కావాలని కేసీఆర్ గురుకులాలు పెట్టారని, కానీ ఇప్పుడు ఎస్సీ గురుకులాల పట్ల వివక్షతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తల్లిదండ్రులను కూర్చోబెట్టి మాట్లాడలేని వారిని సాంఘిక సంక్షేమ శాఖలో పెట్టారని విమర్శించారు. గురుకుల విద్యార్థిని ఆగసార నందినికి గోల్డ్ మెడల్ వస్తే రేవంత్ రెడ్డి ఎందుకు నగదు ప్రోత్సాహం ఇవ్వరని ప్రశ్నించారు.

గౌలిదొడ్డిలో ఉన్న గురుకుల పాఠశాల సిబ్బందిని తొలగిస్తున్నారని, ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులను బయటకు పంపాలని ఆదేశాలు ఇచ్చారని ఆయన వెల్లడించారు. తాము గురుకుల బాట చేపడితే లోపలికి రానివ్వలేదని, ఇదేనా రాహుల్ గాంధీ రాజ్యాంగం చేతిలో పట్టుకుని చెప్పే రాజ్యాంగం అని మండిపడ్డారు. సంపన్న వర్గాల పిల్లలకు ఒక రూల్, పేద పిల్లలకు ఒక రూల్ అంటూ వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. “మా రొట్టెలు మేమే చేసుకుని తినాలా? మేము పన్నులు ఎందుకు కట్టాలి? రేవంత్ రెడ్డికి సీఎంగా వచ్చే 4 లక్షల జీతం మా పన్నులతో కాదా?” అని ప్రశ్నించారు.ఎస్సీలకు బాయ్స్, గర్ల్స్‌కు ఒకే చోట తరగతులు ఉండకూడదని ప్రభుత్వం అంటోందని, అమ్మాయిలకు భువనగిరిలో సైనిక స్కూల్ పెడితే దాన్ని మూసివేశారని డా. ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వం మొద్దు నిద్రపోతుందని విమర్శించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా 30 గురుకుల మహిళా డిగ్రీ కాలేజీలు కేసీఆర్ పెట్టారని, ఈ రోజు డిగ్రీ కాలేజీల్లో ఒక్క అడ్మిషన్ కూడా కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకుల మహిళా డిగ్రీ కాలేజీలు మూతపడే విధంగా రేవంత్ రెడ్డి, అలుగు వర్షిని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

గురుకుల భవనాలు కట్టడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం స్థలం ఇచ్చిందని, కానీ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పేరుతో రేవంత్ రెడ్డి స్కామ్ చేస్తున్నారని, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం తన అనుచరులకు ఇచ్చే విధంగా ప్రయత్నం చేస్తున్నారని డా. ప్రవీణ్ కుమార్ అన్నారు. గురుకుల ఇంటర్ కాలేజీల్లో విద్యార్థులు ఫెయిల్ అయితే ప్రభుత్వం సప్లిమెంటరీ ఫీజు కట్టలేదని, గురుకులాల విద్యార్థులు రాష్ట్రమంత్రి దామోదర రాజనర్సింహ దగ్గరకు వెళ్తే ఆయన ఏం చేయలేకపోయారని తెలిపారు. గురుకులాల అసిస్టెంట్ కేర్ టేకర్స్‌ను అలుగు వర్షిని తొలగించారని, బీఆర్ఎస్ హయాంలో గురుకులాల్లో సమ్మర్ క్యాంపులు పెట్టారని, కానీ రేవంత్ రెడ్డి పాలనలో సమ్మర్ క్యాంపులను రద్దు చేశారని వివరించారు. అందాల పోటీలకు వచ్చిన వారికి 30 తులాల బంగారం ఇవ్వడానికి బడ్జెట్ వస్తుందని, కానీ పేద పిల్లల చదువుకు బడ్జెట్ లేదా అని ప్రశ్నించారు. మూడు స్కూళ్లకు కలిపి ఒక ఎలక్ట్రీషియన్‌ను పెట్టారని, గురుకులాల్లో ఔట్ సోర్సింగ్, పార్ట్ టైమ్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం లేదని తెలిపారు. మంత్రులు భట్టి విక్రమార్క, దామోదర రాజనర్సింహ, ఎస్సీ ఎమ్మెల్యేలు రేవంత్ రెడ్డిని ఎందుకు నిలదీయడం లేదని, దళిత మంత్రులు, ఎమ్మెల్యేలు బానిస బ్రతుకులు ఎందుకు బ్రతుకుతున్నారని డా. ప్రవీణ్ కుమార్ తీవ్ర స్వరంతో ప్రశ్నించారు. పేద ప్రజలపై బాధ్యత లేని అధికారులను వెంటనే తొలగించాలని, అలుగు వర్షిని లాంటి అధికారులను సీఎంఓ ఆఫీసులో పెట్టుకోవాలని సూచించారు. గురుకులాలు రాష్ట్రంలో ప్రమాదంలో ఉన్నాయని, గురుకులాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలుగు వర్షినిపై చర్యలు తీసుకోవాలని, ఆమెను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

# ఏసీబీకి చిక్కిన ఎల్లారెడ్డిపేట సర్వేయర్..

**- రూ. 15000 లంచం తీసుకుంటూ పట్టుపడ్డ సర్వేయర్ నాగరాజు..**

**బలగం టీవీ, సిరిసిల్ల**



రూ. 15000 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు సర్వేయర్ నాగరాజు పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లరెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన జక్కాపురం మల్లేశం భూమిని సర్వే చేసేందుకు ఎల్లారెడ్డిపేట సర్వేయర్ నాగరాజుని సంప్రదించగా, భూమిని సర్వే చేయడానికి సర్వేయర్ డబ్బులు డిమాండ్ చేశాడు. మొదట విడుతగా 20 వేల రూపాయలు లంచం తీసుకొని, పంచనామా రిపోర్ట్ కోసం రెండు నెలలుగా బాధితున్ని సర్వేయర్ నాగరాజు చుట్టూ తిప్పుకున్నాడు. పంచనామా రిపోర్టు కోసం సర్వేయర్ కి ఫోన్ చేయగా మిగిలిన డబ్బులు ఇవ్వాలని సర్వేయర్ డిమాండ్ చేయగా చేసేది ఏమీ లేక బాధితుడు మల్లేశం ఏసీబీ అధికారులను సంప్రదించాడు. శనివారం సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటలో రైతు వేదికలో సర్వేయర్ల కి సర్వేయర్ నాగరాజు శిక్షణ ఇస్తున్నాడు. అక్కడే మల్లేశం వద్ద డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండ్ గా పట్టుకున్నారు. సర్వేయర్ పై కేసు నమోదు చేసి అరెస్టు చేసి, కరీంనగర్ ఏసీబీ కోర్టుకి తరలించినట్లు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ అధికారులు లంచాలు అడుగుతే 10 64 లేదా 9440446106 నెంబర్లకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.ఈ దాడులలో సిఐలు తిరుపతి, కృష్ణకుమార్ లు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాతో ఇబ్బంది పడుతున్నాం

**- గీతా కార్మికులు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మి వీధి నుంచి అక్రమ ఇసుక రవాణాతో ఇబ్బందులు పడుతున్నామని గీత కార్మికులు వాపోయారు. మహాలక్ష్మి వీధి నుండి ఇసుకను తరలిస్తున్న సమయంలో శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో దుమ్ముతో ఇబ్బంది పడుతున్నామని ఆలయ నిర్వాహకులు అన్నారు. ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడుతూ, భక్తుల సంఖ్య తగ్గుతున్నదని అన్నారు.



# ఘనంగా అసల్యాబాయ్ హెూంల్కల్ జయంతి వేడుకలు

**బలగం టీవీ, సిరిసిల్ల**

వీరవనిత అసల్యాబాయ్ హెూంల్కల్ 300 వ జయంతి వేడుకలను రాజన్న జిల్లా కేంద్రం లో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం దగ్గర అహల్యాబాయ్ చిత్రపటానికి నివాళులు అర్పించి, అహల్యాబాయ్ జయంతి శోభాయాత్రను స్థానిక విగ్రహం వద్ద నుండి గాంధీ విగ్రహం వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర నాయకులు అల్లాపూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలను, మహిళల అభ్యున్నతికి, మరియు దేవాలయాల పునర్నిర్మాణంలో అహల్యా బాయ్ ఎనలేని కృషి చేశారని అన్నారు.. ఈ కార్యక్రమంలో అహల్యా బాయ్ జయంతి కమిటీ కన్వీనర్ మల్లారపు సంతోష్ రెడ్డి, కొకన్వీనర్ పల్లం అన్నపూర్ణ, వైశాలి, హరీష, మరియు స్టేట్ కౌన్సిల్ మెంబర్ మ్యాన రాంప్రసాద్,టౌన్ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్ ఆయా మండలాల అధ్యక్షులు క్రాంతి, రామచంద్రారెడ్డి, బాలాజీ, కోడె రమేష్, లక్పతి, పరమేష్, నాయకులు విష్ణు , శ్రీనివాస్ రావు,మరియు మహిళా మోర్చా నాయకులు , ఆయా మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు..


# బీఆర్ఎస్, బీజేపీలో విలీనం కుట్రలను ఖండిస్తున్నాం

**-సిరికొండ మధుసూదనాచారి**

**బలగం టీవీ, హైదరాబాద్**


బీఆర్ఎస్ బీజేపీలో విలీనం కాబోతోందని కొంతమంది వ్యక్తులు, కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న కుట్రపూరిత ప్రచారాన్ని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి తీవ్రంగా ఖండించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీని బలహీనపరిచేందుకు ఇటువంటి దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా టీడీపీ ఆవిర్భావం జరిగిందని గుర్తుచేసిన మధుసూదనాచారి, ప్రతికూల పరిస్థితుల్లో, తెలంగాణ అంటే నక్సలైట్లు అన్న సందర్భంలో కేసీఆర్ టీఆర్ఎస్‌ను స్థాపించారని అన్నారు. ఇద్దరు బలమైన నాయకులు చంద్రబాబు, వైఎస్ఆర్‌లను కేసీఆర్ ఎదుర్కొని తెలంగాణ సాధించి ముఖ్యమంత్రి అయ్యారని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని ఆయన వివరించారు.కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణ ప్రయోజనాలను కాపాడలేవని మధుసూదనాచారి స్పష్టం చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా లేనందుకు ప్రజలు బాధపడుతున్నారని, కేసీఆర్ పాలన చర్చకు వస్తే కాంగ్రెస్, బీజేపీల రాజకీయ పునాదులు కదులుతాయని ఆయన పేర్కొన్నారు. పరిపాలనలో కాంగ్రెస్, బీజేపీ ప్రజల మెప్పు పొందాలని, కేంద్రమంత్రుల భాష, వారి పాలన ప్రజలు అసహ్యించుకునే విధంగా ఉందని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వం పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారని ఆయన అన్నారు.జూన్ 2వ తేదీన తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు జరుగుతాయని తెలిపారు. కేసీఆర్ ఆలోచనలు తనకు తెలుసని, తెలంగాణ ప్రయోజనాలకు ఎట్టిపరిస్థితుల్లోనూ భంగం కలగదని ఆయన హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రజలు ఉన్నంతవరకు బీఆర్ఎస్ ఉంటుందని, పార్టీలో ఏ నిర్ణయం అయినా కేసీఆర్ తీసుకుంటారని స్పష్టం చేశారు. జూన్ 2వ తేదీన కాళేశ్వరం ప్రాజెక్టుపై హరీష్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తారని ఆయన ప్రకటించారు.

# మహేశ్ ఖలేజా రీ రిలీజ్ ఆల్ టైమ్ రికార్డ్




**బలగం టీవి, హైదరాబాద్**

టాలీవుడ్‌లో మహేశ్ 'ఖలేజా' తాజాగా రీ రిలీజ్ కాగా.. కళ్లు చెదిరే వసూళ్లు వచ్చాయి. రీ రిలీజ్ ట్రెండ్‌లో మహేశ్ సినిమాలకు ఎక్కువ ఆదరణ దక్కుతోంది. మురారి, బిజినెస్‌మ్యాన్, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు తదితర చిత్రాలని రీ రిలీజ్ చేయగా.. అభిమానులు థియేటర్లలో రచ్చ రచ్చ చేశారు. తాజాగా సూపర్‌స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా 'ఖలేజా'ని మళ్లీ థియేటర్లలోకి తీసుకొచ్చారు. దీనికి ఏకంగా ప్రీమియర్స్ కూడా వేయడం విశేషం.ఇప్పుడు 'ఖలేజా' మూవీ రీ రిలీజ్‌లోనూ రికార్డ్స్ సృష్టించినట్లు తెలుస్తోంది. తొలిరోజు మొత్తం రూ.8.26 కోట్ల మేర కలెక్షన్స్ వచ్చాయి. ఈ క్రమంలోనే అధికారిక పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో మహేశ్ బాబు నటించిన 'ఖలేజా'.. 2010లో థియేటర్లలో రిలీజైంది. అప్పుడేమో డిజాస్టర్ అయింది. తర్వాత టీవీల్లో ప్రసారమైనప్పుడు చాలామందికి ఇది ఫేవరెట్ అయిపోయింది. ఇప్పుడు రీ రిలీజ్ వల్ల అభిమానులు ఈ చిత్రంపై తన ప్రేమనంతా చూపించారు. వచ్చే శుక్రవారం వరకు ఈ మూవీని తెలుగు రాష్ట్రా ల్లోని పలు థియేటర్లలో ప్రదర్శించనున్నారు.

## ఫ్రెంచ్ ఓపెన్ ప్రీక్వార్టర్స్‌లోకి అరియానా సబలెంకా, స్వియాటెక్

**బలగం టీవి, హైదరాబాద్**

ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో ప్రపంచ నెంబర్ వన్ అరియానా సబలెంకా, డిఫెండింగ్ ఛాంపియన్ ఇగా స్వియాటెక్ ప్రీక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. వీరితో పాటు నాలుగో సీడ్ పావొలిని, ఎనిమిదో సీడ్ క్విన్ వెన్‌జెంగ్, 12వ సీడ్ రిబాకినాలు కూడా ప్రీక్వార్టర్స్‌లోకి చేరారు. పురుషుల సింగిల్స్‌లో లొరెంజో ముసెట్టి(ఇటలీ), పదో సీడ్ హొల్గర్ రూన్(డెన్మార్క్) ప్రీక్వార్టర్స్ చేరాడు. ఆయనతో పాటు టామీ పాల్(అమెరికా), పాపిరిన్(ఆస్ట్రేలియా) కూడా ప్రీక్వార్టర్స్‌లో చేరారు. పురుషుల డబుల్స్‌లో భారత ప్లేయర్ యూకీ బాంబ్రీ తన అమెరికా భాగస్వామితో కలిసి ప్రీక్వార్టర్స్‌లోకి ప్రవేశించాడు.

డిఫెండింగ్ మహిళల ఛాంపియన్ ఇగా స్వియాటెక్, టాప్ సీడ్ అరియానా సబలెంకా ఫ్రెంచ్ ఓపెన్‌లో నాల్గవ రౌండ్‌కు చేరుకున్నారు. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లలో ఇగా స్వియాటెక్, అరియానా సబలెంకాలు ఒక్క సెట్ కూడా ఓడిపోకుండానే ప్రీక్వార్టర్స్ చేరారు. మూడు సార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ సబలెంకా 6–2, 6–3 తేడాతో ఓల్గా డానిలోవిచ్‌ను ఓడించింది. రోలాండ్ గారోస్‌లో తన ఐదు ప్రధాన టైటిళ్లను గెలుచుకున్న ఇగా స్వియాటెక్, జాక్వెలిన్ క్రిస్టియన్‌ను 6–2, 7–5 తేడాతో ఓడించింది. ఫ్రెంచ్ ఓపెన్‌లో ఇది ఆమెకు వరుసగా 23వ విజయం. మహిళల మ్యాచ్‌లలో, ఒలింపిక్ ఛాంపియన్ క్విన్ వెన్‌జెంగ్ 18 ఏళ్ల క్వాలిఫైయర్ విక్టోరియా ఎంబోకోను 6–3, 6–4 తేడాతో ఓడించింది. 16వ ర్యాంక్ క్రీడాకారిణి అమండా అనిసిమోవా, లియుడ్మిలా సామ్సోనోవా కూడా తమ మ్యాచ్‌లను గెలుచుకున్నారు. మహిళల విభాగంలో, అమెరికాకు చెందిన రెండవ సీడ్ కోకో గౌఫ్ కూడా విజయంతో తదుపరి రౌండ్‌కు వెళ్లగలిగారు.

పురుషుల సింగిల్స్ మూడో రౌండ్‌లో ఎనిమిదో సీడ్ లొరెంజో ముసెట్టి(ఇటలీ) మరియానో నవోన్‌ను, హొల్గర్ రూన్ ఫ్రాన్స్‌కు చెందిన క్వెంటిన్ హాలిస్‌ను ఓడించాడు. అమెరికాకు చెందిన 12వ సీడ్ టామీ పాల్ కరెన్ ఖచనోవ్‌ను ఓడించి తదుపరి రౌండ్‌కు చేరుకున్నాడు.



## అఖిల్ వివాహానికి సీఎంను ఆహ్వానించిన నాగార్జున

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని టాలీవుడ్ నటుడు నాగార్జున కలిశారు. సీఎం నివాసంలో ఆయన్ను కలిసి త్వరలో జరగనున్న తన చిన్న కుమారుడు అఖిల్ వివాహ వేడుకకు ఆహ్వానించారు. అలాగే ఆయనతో కాసేపు చర్చించారు. గతేడాది నవంబర్‌లో అక్కినేని అఖిల్ నిశ్చితార్థం జైనబ్ రవ్జీతో జరిగిన విషయం తెలిసిందే. అయితే అధికారికంగా వివాహ తేదీ వెల్లడించనప్పటికీ.. జూన్ 6న ఈ వేడుక జరగనున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి.




## 'పోలీస్ కంప్లెయింట్' ఫస్ట్ లుక్

**బలగం టీవి, హైదరాబాద్**

నటి వరలక్ష్మి శరత్ కుమార్ తెలుగులో నటిస్తున్న చిత్రం 'పోలీస్ కంప్లెయింట్' . ఈ మూవీలోని వరలక్ష్మి శరత్ కుమార్ ఫస్ట్ లుక్ ను సూపర్ స్టార్ కృష్ణ జన్మదినం సందర్భంగా చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ సినిమాలో పవర్‌ఫుల్ క్యారెక్టరైజేషన్‌తో పాటు, తొలిసారి ఆద్యంతం వినోదాన్ని కలిగించే పాత్రలో ఆమె నటించడం విశేషం. ఈ చిత్రంలో సూపర్ స్టార్ కృష్ణ మీద స్పెషల్ సాంగ్ షూట్ చేశామని, అది సినిమాకే మెయిన్ హైలెట్ అని నిర్మాతలు సింగపూర్ బాలకృష్ణ , మల్లెల ప్రభాకర్ తెలిపారు.

## పవన్‌పై ఎవరు కుట్ర పన్నుతారు

- **ఆర్ నారాయణ మూర్తి**

**బలగం టీవి, హైదరాబాద్**



థియేటర్లలో 'పర్సంటేజీ విధానం' అమలు చేయాలని పీపుల్స్ స్టార్ ఆర్. నారాయణమూర్తి డిమాండ్ చేశారు. పర్సంటేజీ సిస్టం కోసం పోరాడుతూ బంద్ ప్రకటిస్తే, దానిని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేశ్ లు 'హరి హర వీరమల్లు' సినిమాను అడ్డుకునే ప్రయత్నంగా చిత్రీకరించడం సరికాదని అన్నారు. పర్సంటేజీ విధానం అమలైతే చిన్న సినిమాలు తీసే తనలాంటి నిర్మాతల కష్టాలు తొలగిపోతాయని ఆశించినట్లుపేర్కొన్నారు. అయితే, థియేటర్ల బంద్‌ను 'హరి హర వీరమల్లు' సినిమాను అడ్డుకునేందుకు తెరపైకి తెచ్చారని స్వయానా మంత్రి కందుల దుర్గేశ్ అనడం తనను బాధించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పవన్‌పై ఎవరు కుట్ర పన్నుతారని అన్నారు. పవన్ కళ్యాణ్ కష్టపడి డిప్యూటీ సీఎం అవ్వడం తనకు ఎంతో గర్వంగా ఉందని కానీ డిప్యూటీ సీఎంగా ఉండి 'హరి హర వీరమల్లు' టాపిక్ తీసుకురావడం బాధకలిగించిదన్నారు. ప్రస్తుతం థియేటర్లలో ఉన్న పాప్‌కార్న్ రేట్లు, టికెట్ రేట్లు అన్నీ కలిసి సామాన్యుడిని సినిమాకు దూరం చేస్తున్నాయని చెప్పారు. అసలు టికెట్ రేట్ల పెంపు కోసం ఎందుకు అడుగుతున్నారని, ఎందుకు పెంచుతున్నారని ఆయన ప్రశ్నించారు. హాలీవుడ్‌లో వేల కోట్లు పెట్టి 'ది టెన్ కమాండ్మెంట్స్', 'బెనహర్' వంటి చిత్రాలు తీశారని, కానీ వారెప్పుడూ టికెట్ రేట్లు పెంచమని అడగలేదని ఆయన గుర్తు చేశారు. అలాగే, 'మొఘల్ ఎ ఆజాం', 'షోలే' వంటి చిత్రాలు ఎన్నో ఏళ్లు కష్టపడి తీసినా ఎక్కడా టికెట్ రేట్లను పెంచలేదన్నారు. 'లవకుశ' సినిమా ఐదేళ్లు కష్టపడి తీసి అప్పుల పాలైనా టికెట్ రేట్లను పెంచలేదని గుర్తు చేశారు. సినిమా బాగుంటే జనాలు వస్తారని, హిట్ చేస్తారని, "లారీల్లో, గూడ్స్ ట్రైన్లలో తీసుకు వెళ్లేంత లాభాల్ని ఇస్తారు" అని వ్యాఖ్యానించారు. వేల కోట్ల బడ్జెట్‌లతో భారీ సినిమాలు తీస్తున్నందుకు గర్విస్తున్నామని, అయితే టికెట్ రేట్లు ఎందుకు పెంచుతున్నారని ప్రశ్నించారు. మామూలు టికెట్ రేట్లతోనే సినిమాను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బంద్ ప్రకటించే హక్కు అందరికీ ఉంటుం దన్నారు. అయితే, మూడు వారాల ముందు ఫిల్మ్ ఛాంబర్‌కు తెలియపరచాలని, జూన్ 1న బంద్ ప్రకటిస్తే, మూడు వారాల ముందు చెప్పలేదు కాబట్టి అది వర్తించదన్నారు. తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ప్రకటించి నట్లుగానే ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఈ తరహా అవార్డులను తీసుకురావాలని డిమాండ్ చేశారు.

## చిరు, అనీల్ మూవీ మొదటి షెడ్యూల్ పూర్తి

**బలగం టీవి, హైదరాబాద్**



టాలీవుడ్ నటుడు మెగాస్టార్ చిరంజీవి హీరోగా నయనతార హీరోయిన్ గా దర్శకుడు అనీల్ రావిపూడి సినిమా తెరుకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ రీసెంట్ గానే మొదలైంది. ఇలా మొదటి షెడ్యూల్ ని స్టార్ట్ చేసుకున్న సినిమా సూపర్ స్పీడ్ లో ఈ షెడ్యూల్ ని ఆల్రెడీ కంప్లీట్ చేసేసిందని సమాచారం. ఇలా మొత్తానికి మాత్రమే అనీల్ రావిపూడి అండ్ టీం మెగాస్టార్ సినిమాకి పర్ఫెక్ట్ వర్క్ ని అందిస్తున్నారని చెప్పొచ్చు. ఇక ఇదిలా ఉండగా దీనితో పాటుగా రెండో షెడ్యూల్ కి కూడా రంగం సిద్ధం చేసిన ట్టుగా తెలుస్తుంది. మొత్తానికి మాత్రం వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో ఎట్టి పరిస్థితుల్లో ఈ చిత్రం రావచ్చని చెప్పవచ్చు.

## సినిమాకు వయసుతో సంబంధం లేదు

- **నటుడు మంచు విష్ణు**

**బలగం టీవి, హైదరాబాద్**



కన్నప్ప రిలీజ్ కు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. మహాభారతం ఫేమ్ ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించగా.. 24 ఫ్రేమ్ ఫ్యాక్టరీ బ్యానర్ పై మంచు మోహన్ బాబు భారీ బడ్జెట్ తో నిర్మించారు. జూన్ 27వ తేదీన తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో మూవీ రిలీజ్ అవ్వనుంది. పరమ శివుడి భక్తుడు కన్నప్ప పాత్రలో విష్ణు నటించారు. ప్రీతి ముకుందన్ ఫిమేల్ లీడ్ రోల్ పోషించారు. సాధువు రుద్ర పాత్రలో ప్రభాస్ కనిపించనున్నారు. మహాశివుడిగా అక్షయ్ కుమార్, పార్వతిదేవిగా కాజల్ అగర్వాల్ నటించారు. ప్రభాస్. కిరాటా రోల్ ను మోహన్?లాల్ చేశారు. మోహన్ బాబు నిర్మిస్తూనే కీలక పాత్ర పోషించారు. తాజాగా బాలీవుడ్ లో ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు మేకర్స్. మంచు విష్ణు ఇంటర్వ్యూలు ఇవ్వడం స్టార్ట్ చేశారు. ఆ సమయంలో.. ప్రస్తుత జనరేషన్ కన్నప్ప చూడటానికి ఆసక్తి చూపుతారా అని హోస్ట్ అడగ్గా.. హీరో విష్ణు రెస్పాండ్ అయ్యారు. ఆడియన్స్ చాలా తెలివైన వారని తెలిపారు. "ఒక సినిమా ప్రామిసింగ్ గా ఉందని భావిస్తే, వెళ్లి దాన్ని చూస్తారు. దానికి వయసుతో సంబంధం లేదు. దీనికి మంచి ఉదాహరణ చావా. ఛత్రపతి శివాజీ మహారాజ్ కుమారుడు శంభాజీ మహారాజ్ స్టోరీతో వచ్చిన సినిమాకు చెన్నై, హైదరాబాద్, బెంగళూరులో హౌస్ ఫుల్స్ ఎలా అయ్యాయి?" అని అన్నారు. "అద్భుతమైన కథ చెప్పడం, గొప్ప తారాగణం ఎంపిక, మంచి దర్శకత్వం కారణంగా ప్రజలు చావా సినిమాను ఆదరించారు. ప్రజలు మన చరిత్ర తెలుసుకోవాలనుకోవడం వల్ల అది జరిగింది. చావా, కన్నప్ప వంటి సినిమాలు చరిత్రను చెబుతాయి. అందుకే మూవీ ప్రామిసింగ్ గా ఉంటే ఏ జెనరేషన్ వాళ్లైనా చూస్తారు" అని విష్ణు స్పష్టం చేశారు.

## తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు : మహేశ్ బాబు, సుకుమార్

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ ఫిల్మ్ అవార్డుల పట్ల టాలీవుడ్ నటుడు మహేశ్ బాబు, ప్రముఖ దర్శకుడు సుకుమార్ ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మహేశ్ బాబు స్పందిస్తూ, "శ్రీమంతుడు, మహర్షి, మేజర్ వంటి చిత్రాలకు గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డులు దక్కడం ఎంతో సంతోషాన్ని కలిగించింది. ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన గౌరవాన్ని అందించి, సినీ పండుగలాంటి వాతావరణాన్ని సృష్టించేందుకు చొరవ తీసుకున్న తెలంగాణ ప్రభుత్వానికి నా ప్రత్యేక ధన్యవాదాలు. ఈ సినిమాల విజయానికి కారకులైన నా దర్శకులకు మరింత ప్రేమను తెలియజేస్తున్నాను" అని పేర్కొన్నారు ప్రముఖ దర్శకుడు సుకుమార్ "ప్రతిష్ఠాత్మకంగా భావించే గద్దర్ ఫిల్మ్ పురస్కారాల్లో భాగంగా నాకు బీఎన్ రెడ్డి ఫిల్మ్ అవార్డు ప్రకటించడం ఎంతో గౌరవంగా ఉంది. ఇంత గొప్ప అవార్డుకు నన్ను ఎంపిక చేసినందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, గద్దర్ ఫిల్మ్ అవార్డుల జ్యూరీకి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. తెలుగు సినిమా పరిశ్రమలో ఒక శిఖరంలాంటి వ్యక్తి బీఎన్ రెడ్డి గారి పేరు మీద నెలకొల్పిన అవార్డును అందుకోవడం మరింత గర్వకారణం. నా చిత్రాల్లో భాగస్వాములైన నటీనట ులకు, సాంకేతిక నిపుణులకు, నిర్మాతలకు, అలాగే నా చిత్రాలను ఆదరిస్తున్న ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను" అని అన్నారు.